జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 20-2-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 597 పేజీలు: 4 వెల : రూ.7



* వలాస కాశీబుగ్గలో వరుస దొంగతనాలు * విశాఖ నుంచి వచ్చి మరీ చోరీలు

* సీసీ కెమెరాలకు పట్టుబడిన దొంగ * కాశీబుగ్గ పోలీసులకు మాత్రం చిక్కని అగంతకుడు * ఆందోళన చెందుతున్న జంట పట్టణవాసులు

# చిక్కడు.. దొరకడు!

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 19 (వార్త): ఏడాది కాలంగా ఓ దొంగ పలాస కాశీబుగ్గ జంట పట్టణవాసులతో పాటు పోలీసులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాడు. వరుస చోరీలకు పాల్పడుతూ బెంబేలెత్తిస్తున్నాడు. ఎటువంటి కేసునైనా ఛేదించగల సత్తా ఉన్న కాశీబుగ్గ పోలీసులు.. ఈ దొంగను పట్టుకోవడంలో కొంత తడబాటుకు గురవుతున్నారు. ఈ చిక్కడు.. దొరకడు పోలీసులకు తలనొప్పిగా మారాడు. గత ఏడాది ఆగస్టు నెలలో పలాస కాశీబుగ్గ జంట పట్టణంలో రెండు మెడికల్ షాపులతో పాటు కిరాణా షాపులు, మొబైల్ షాపుల్లో చోరీకి పాల్పడ్డాడు. అలాగే అక్టోబర్ నెలలో మరో రెండు మెడికల్ షాపులతో పాటు టైలరింగ్ మెటీరియల్ షాపుతో పాటు మొబైల్ షాపులో దొంగతనం చేశాడు. మంగళవారం రాత్రి అన్నపూర్ణ థియేటర్ వద్ద ఉన్న హెచ్‌పీ గ్యాస్ దుకాణంతో పాటు భాస్కర్ మెడికల్ షాపులో చోరీయత్నం చేసి విఫలమయ్యాడు. ఈ దొంగ ముఖానికి మంకీ క్యాప్, మాస్క్ వేసుకుని రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. విశాఖపట్నం నుంచి పలాస కాశీబుగ్గ వచ్చి షాపులకు ఉన్న తాళాలు తొలగించి దొరికిన కాడికి దోచుకుపోతున్నాడు. షాపుల ముందు ఉన్న సీసీ కెమెరాలు, లైట్లు తొలగించి మరీ చోరీ చేస్తున్నాడు. కాశీబుగ్గ పోలీసులు సైతం సీసీ కెమెరాలను సమగ్రంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ దొంగ సింహాచలంలో ఉన్నట్టు టవర్ లోకేషన్ ద్వారా తెలుసుకున్నా పట్టుకోవడంలో మాత్రం విఫలమయ్యారని తెలిసింది. ఈ దొంగను పట్టుకునేందుకు ఒక బృందం గాలిస్తుందని సమాచారం. త్వరలోనే ఈ దొంగను పట్టుకుంటామని కాశీబుగ్గ పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ దొంగ ఎప్పుడు ఏ షాపుపై పడతాడోనని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.



## సీఎం సారూ.. సమస్యలు..
# పరిష్కరించరూ

* ముఖ్యమంత్రికి నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రమిచ్చిన పాతపట్నం ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం, ఫిబ్రవరి19 (వార్త): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి కార్యాలయంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. వంశధార నిర్వాసితులపై గతంలో నమోదు చేసిన కేసులను మానవతా దృష్టితో ఉపసంహరించుకోవాలని, వారికి న్యాయం చేయాలన్నారు. జల జీవన్ మిషన్ నిధులు 110 కోట్లు పునరుద్ధరణ చేసి నియోజకవర్గం ప్రజలు నీటి కష్టాలను తీర్చాలని కోరారు. మహేంద్ర తనయ - వంశధార నదులపై నూతన వంతెనల మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ ప్రజల ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పలు ప్రధాన రహదారులను డబుల్ రోడ్లుగా విస్తరించాలన్నారు. నియోజకవర్గంలో సాగునీటి సమస్యల పరిష్కారం కోసం పలు ఎత్తిపోతల పథకాలు అభివృద్ధి కొరకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. వరద ముప్పు గ్రామాలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జల జీవన్ మిషన్ కింద సుమారు రూ.110 కోట్ల నిధులు వెనక్కు మళ్లించబడిందన్న విషయాన్ని ముఖ్యమంత్రి వద్ద ఎమ్మెల్యే ప్రస్తావించారు. మహేంద్ర తనయ నది ఎగువ ప్రాంతాల ప్రజలకు తాగునీటి సరఫరా కష్టసాధ్యంగా మారిన నేపథ్యంలో ఆ నిధులను తక్షణమే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. భగీరథపురం నుండి హిరమండలం మండల కేంద్రానికి వంశధార నది మీదుగా నూతన వంతెన నిర్మాణం మంజూరు చేయాలని కోరారు. హిరమండలం మండలం కల్లట - జిల్లేడుపేట గ్రామం ప్రతి ఏడాది భారీ వర్షాల వల్ల మహేంద్ర తనయ నది ఉప్పొంగి గ్రామ ప్రజలు రోజుల తరబడి చిక్కుకుపోతున్నారని తెలిపారు. గ్రామ ప్రజలకు రక్షణగా నూతన వంతెన నిర్మిస్తే విద్యార్థులు, రైతులు, సాధారణ ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని నిధులు మంజూరు చేయాలని కోరారు. పాతపట్నం మండలం బూరగాం గ్రామ రైతులు ప్రతిరోజు మహేంద్ర తనయ నది దాటి పొలాలకు వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, గ్రామ ప్రజలు, రైతుల ఆశలు దిశగా అడుగులు వేస్తూ నూతన వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని కె.గోపాలపురం, ఎం.గోపాలపురం హామ్లెట్ గ్రామాల ప్రజలు ప్రతి సంవత్సరం వర్షాల సమయంలో కాజ్‌వే మునిగిపోవడంతో రైల్వే బ్రిడ్జిపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారని వివరించారు. ప్రజల ప్రాణ భద్రత కోసం నూతన వంతెన మంజూరు చేయాలని కోరారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి సావధానంగా విని త్వరలో అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని భరోసా ఇచ్చారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



## స్వచ్ఛ రథం ప్రారంభం



**పోలాకి, ఫిబ్రవరి 19(వార్త):** స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పోలాకి మండలం మబగాం గ్రామంలో పొడి చెత్త సేకరణకు ప్రత్యేకంగా 'స్వచ్ఛ రథం'ను నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన ప్రారంభించారు. ఈ సందర్భంగా బగ్గు అర్చన మాట్లాడుతూ, ప్రజలు తమ ఇళ్లలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను అందిస్తే, వాటి బదులుగా నిత్యావసర సరుకులను రథం సిబ్బంది అందజేస్తారని తెలిపారు. సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్‌కు పంపించడం ద్వారా పర్యావరణ సంరక్షణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామ పరిశుభ్రతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బగ్గు సుగుణమ్మ, నీటి సంఘం అధ్యక్షులు ధర్మాన అమ్మన్నాయుడు, కాయ రవి, జుత్తు తాతబాబు, వెలమల రమేష్, కర్రెన్న, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు తీపి కబురు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 19 (వార్త):** జిల్లాలోని భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రభుత్వం పునరుద్ధరించిందని ఉప కార్మిక కమిషనర్ అజయ్ కార్తికేయ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు, నిలిచిపోయిన పథకాలను తిరిగి అమలు చేసేందుకు తగిన చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కార్మికులు తమ గుర్తింపు కార్డులు ప్రస్తుతం అమలులో ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని, ఇందుకోసం ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, పాత గుర్తింపు కార్డుతో సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్డు గడువు ముగిసినా లేదా నిలిచిపోయినా సంక్షేమ ఫలాలకు అర్హత కోల్పోయే ప్రమాదం ఉందని, కార్మికులు తక్షణమే స్పందించాలని కోరారు. ఇతర వివరాల కోసం 94925 55037 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన వివరించారు.

## 28లోగా 'లైఫ్ సర్టిఫికేట్' సమర్పించాలి

**ఆమదాలవలస, ఫిబ్రవరి 19 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ పొందుతున్న వారు ఈనెల 28వ తేదీలోగా తమ వార్షిక జీవన ప్రమాణ పత్రాన్ని (లైఫ్ సర్టిఫికేట్) తప్పనిసరిగా సమర్పించాలని ఆమదాలవలస ఉప ఖజానా అధికారి (ఎస్.టి.ఓ) బట్న కృష్ణారావు ఒక ప్రకటనలో కోరారు. ఆమదాలవలస పరిధిలో ఇంకా 87 మంది పెన్షనర్లు తమ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉందని, వీరు తమకు సమీపంలోని నెట్ సెంటర్లలో 'జీవన్ ప్రమాణ్' ద్వారా లేదా రాష్ట్రవ్యాప్తంగా ఏ జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీ కార్యాలయంలోనైనా బయోమెట్రిక్ ద్వారా ఈ ప్రక్రియ పూర్తి చేయవచ్చని సూచించారు. వృద్ధాప్యం, అనారోగ్య కారణాల వల్ల బయోమెట్రిక్ పడని వారు లేదా కార్యాలయానికి రాలేని వారు వెంటనే ఆమదాలవలస ఉప ఖజానా కార్యాలయంలో సంప్రదిస్తే, సంబంధిత సిబ్బందిని వారి ఇంటికే పంపించి 'ఫిజికల్ లైఫ్ సర్టిఫికేట్' సేకరిస్తామని ఆయన తెలిపారు. అయితే, జీవో నంబర్ 315 ప్రకారం పెన్షన్ పొందుతున్న వారు మాత్రం స్వయంగా సంబంధిత ట్రెజరీ కార్యాలయానికి హాజరై, అవసరమైన పత్రాలతో తమ ధ్రువీకరణను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## 24న జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 19 (వార్త):** జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో ఈ నెల 24న జిల్లా స్థాయి సైక్లింగ్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కేఆర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి జూనియర్ అండర్ 18 విభాగంలో బాలురు, బాలికలకు విడివిడిగా ఈ ఎంపికలు జరుగుతాయి. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా శ్రీకాకుళం జిల్లా నివాసి అయి ఉండాలి. ఆసక్తి గల వారు శాప్ వెబ్‌సైట్ sports.ap.gov.inలో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మార్చి 28న ఎన్.టి.ఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరపున ఎంపిక చేస్తారు. ఇతర వివరాలకు 9390352942, 9494814087 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

## అంగన్ వాడీ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు



**మందస, ఫిబ్రవరి 19(వార్త):** అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పెద్దింటి అరుణ చెప్పారు. మందస మండలంలోని బాలిగాం, బేతాళపురం, భైరిసారంగపురం, బహడపల్లి, కొండలోగాం కేంద్రాలకు మంజూరైన సామాగ్రిని ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారిణి పెద్దింటి అరుణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కేంద్రాలకు కావలసిన సామగ్రిని అందజేశారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఇస్తున్న పౌష్టికాహారం ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ఈ సౌకర్యాలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ లు సీహెచ్ రామలక్ష్మి, పి.జయలక్ష్మి, జె.లక్ష్మి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఈనారీ సీఆర్పీల ద్వారా
## మహిళా జీవనోపాదుల సర్వే



**మందస, ఫిబ్రవరి 19(వార్త):** మహిళా సంఘాల కుటుంబ సభ్యుల ఆదాయ స్థాయి, వారి కుటుంబానికి వాస్తవంగా కావలసిన జీవనోపాదులను గురించి అవసరమైన రుణ సౌకర్యాన్ని కల్పించడానికి ప్రభుత్వం ఈనారీ సీఆర్పీల ద్వారా అన్ని కుటుంబాలకు సర్వే నిర్వహిస్తున్నారని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండల కేంద్రంలోని కొత్త వీధి పరిధిలో సర్వే నిర్వహించిన ఈనారీ సీఆర్పీలతో మాట్లాడుతూ యాప్ వినియోగంలో లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ ఆదాయాన్ని ఖచ్చితంగా తెలుసుకొని వాస్తవంగా నమోదు చేయించాలని సిబ్బందికి సూచనలు చేశారు. మహిళా స్వయం సహాయక సంఘం కుటుంబ సభ్యులలో వాస్తవంగా యాక్టివిటీ ఉండి సంపాదిస్తున్న అందరి ఆదాయం కూడా ఖచ్చితంగా పారదర్శకంగా నమోదు చేసుకోవాలని, భవిష్యత్ లో వారికి అవసరమైన పరపతి ఋణ సౌకర్యాలు మొదలగు అవసరాన్ని బట్టి అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో లీగల్ కోఆర్డినేటర్ తారకమోహన్ తో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, డేటాఎంట్రీ ఆపరేటర్ రాజా, గ్రామ సంఘం వీఏఓ నీరజ, ఈనారీ సీఆర్పీలు హేమలత, ఆదిలక్ష్మి, పూర్ణిమా గౌరీ, రూప తదితరులు పాల్గొన్నారు.

## పలాస బూత్‌లు పరిశీలన

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 19 (వార్త):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలాస నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు సాలిన డిల్లీ యాదవ్ పలాస మండలంలోని పలు బూత్‌లను పరిశీలించారు. 93,94 బూత్ లను పరిశీలించి గత ఎన్నికల్లో అక్కడ పోలైన ఓట్లు వచ్చిన మెజారిటీ దానికి గల కారణాలు విశ్లేషించి అవసరమైన సమాచారాన్ని సేకరించారు. రాష్ట్ర పార్టీ ఆదేశాలు మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.



# రసాయన విపత్తుల వేళ.. అప్రమత్తతే రక్షణ కవచం

* ఫ్యాక్టరీల తనిఖీ అధికారి రాంబాబు
* 21న 'ఆఫ్-సైట్' మాక్ డ్రిల్ నిర్వహణకు సన్నాహాలు
* ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 19 (వార్త):** రసాయన పరిశ్రమల్లో ప్రమాదం సంభవించినప్పుడు క్షణం కూడా వృథా చేయకుండా ప్రాణాలను కాపాడటమే మొదటి ప్రాధాన్యం కావాలని ఫ్యాక్టరీల తనిఖీ అధికారి రాంబాబు అన్నారు. ప్రమాదాలు జరిగేటప్పుడు వివిధ ప్రభుత్వ శాఖలు స్పందించే తీరు, సన్నద్ధత తదితర అంశాలపై ఈనెల 21న పైడి భీమవరం శ్రేయాస్ ఇండస్ట్రీస్ లో నిర్వహించే మాక్ డ్రిల్‌కు ప్రతి రసాయన పరిశ్రమ నుంచి 10 మంది ఫ్రంట్ లైన్ ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని, విపత్తు నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేదని ఆయన హెచ్చరించారు. ఈ నెల 21న నిర్వహించనున్న 'ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్' సన్నాహక సమావేశం గురువారం పైడి భీమవరం అపిటోరియ ఫార్మా లో జరిగింది. రసాయన విపత్తుల సమయంలో అనుసరించాల్సిన ప్రామాణిక నిర్వహణ విధానాలను ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ప్రమాదం జరిగినప్పుడు సమాచారాన్ని వేగంగా చేరవేసేందుకు సైరన్లు, లౌడ్ స్పీకర్లతో పాటు సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు స్పష్టమైన, సంక్షిప్తమైన సందేశాలను మొబైల్ నోటిఫికేషన్ల ద్వారా పంపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అనంతరం రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, ఎన్జీవోలు ఇతర శాఖలు స్పందించాల్సిన, అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు.

### సమన్వయంతోనే విపత్తుల కట్టడి

ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. "తాము ప్రాణాలకు తెగించి పోరాడేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం. అయితే, ఇలాంటి డ్రిల్స్ నిర్వహించేటప్పుడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలి. విపత్తు సమయాల్లో ఎలా స్పందించాలో సామాన్యులకు తెలిసినప్పుడే ఈ కసరత్తుకు పూర్తి ఫలితం ఉంటుంది" అని అన్నారు. జిల్లా, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థల మధ్య నిరంతర సమన్వయం ఉండాలని, పొరుగు జిల్లాల వనరులను కూడా అవసరానికి వాడుకునేలా పరస్పర ఒప్పందాలు ఉండాలని అధికారులు సూచించారు. మున్సిపల్, పోలీస్, ఫైర్, ఆరోగ్య శాఖల అధికారులు సంయుక్తంగా శిక్షణ పొందడం ద్వారా క్షేత్రస్థాయిలో వేగంగా స్పందించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మోహన్ రావు, జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రఘునాథరావు, శ్రేయస్ హెచ్ఆర్, అడ్మిన్ హెడ్ మనోజ్ కుమార్, చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ కన్నారావు, ఎన్ఎసిఎల్ సేఫ్టీ హెల్త్ ఎన్విరాన్మెంట్ హెడ్ వెంకటరాజు, అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వంశీ తదితరులు హాజరయ్యారు.

# ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరవేయాలి

* జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
* యాక్సిస్ బ్యాంకు నూతన బ్రాంచ్ ప్రారంభం



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 19 (వార్త):** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందేలా బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సూచించారు. శ్రీకాకుళం నగరంలోని రామలక్ష్మణ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన యాక్సిస్ బ్యాంకు నూతన బ్రాంచ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. నగరంలో బ్యాంకు శాఖలను విస్తరించడం ద్వారా ఖాతాదారులకు సేవలు మరింత వేగవంతంగా అందుతాయన్నారు. బ్యాంక్ క్లస్టర్ హెడ్ భరణి, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ.. ఇప్పటికే పాలకొండ రోడ్డులోని శాఖ ద్వారా సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్నామని, నూతన బ్రాంచ్‌తో ఖాతాదారులకు మరింత చేరువయ్యామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం శ్రీనివాస్, ఉద్యానవన శాఖ అధికారి రత్నాల ప్రసాద్, ప్రముఖ వ్యాపారవేత్త అంధవరపు ప్రసాద్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ యాళ్లగడ్డ గీతా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లపేటలో రక్షిత నీటి పథకం పనుల ప్రారంభం



**పోలాకి, ఫిబ్రవరి 19(వార్త):** గ్రామాలలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నరసన్నపేట నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన తెలిపారు. పోలాకి మండలం తలసముద్రం పంచాయతీ పరిధిలోని మల్లపేట గ్రామంలో రూ.15.40 లక్షల వ్యయంతో రక్షిత మంచినీటి పథకం, ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు పనులను గురువారం ప్రారంభించారు. అనంతరం బగ్గు అర్చన మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన సంకల్పమన్నారు. పథకం పూర్తయిన తర్వాత ప్రతి ఇంటికి సులభంగా తాగునీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఎసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ సర్పంచులు ప్రగడ సూరిబాబు, చిట్టి సింహాచలం, పోతల రమేష్, భైరి సుందరరావు, భైరి అచ్చెన్నాయుడు, సాధు మాకినాయుడు, సాధు హేమంత్, జల్లు రామారావు, పండి శ్రీను, మల్ల యర్రంనాయుడు, సాధు సింహాద్రి నాయుడు, కొన్న రాజు, గున్న లక్ష్మీనారాయణ, గున్న నవీన్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# గ్రామ స్థాయి నుంచే పౌర సాధికారతకు కృషి




**ఆమదాలవలస, ఫిబ్రవరి 19 (వార్త):** గ్రామీణ స్థాయిలో ప్రతి పౌరుడికి తన హక్కులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వారిని సాధికారత దిశగా నడిపించడమే న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన ఉద్దేశమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె. హరిబాబు తెలిపారు. గాజులకొల్లవలసలో గ్రామ స్థాయిలో పౌరుల సాధికారతపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హత ఉన్న ఏ ఒక్క వ్యక్తికీ సంక్షేమ పథకాలు అందకుండా పోకూడదని, నిరాకరించబడిన సందర్భాల్లో తక్షణమే సంబంధిత శాఖలతో సంప్రదించి వారికి న్యాయం చేయాలని స్పష్టం చేశారు. కులం, ఆదాయం, నివాస ధృవీకరణ పత్రాలతో పాటు రేషన్ కార్డు, ఆధార్, సదరం వంటి కీలక పత్రాలు పొందేందుకు సామాన్యులకు అవసరమైన సహాయం అందించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని హరిబాబు ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ శాఖల ప్రయోజనాలను ప్రజల ముంగిటకే చేర్చడంలో లీగల్ సర్వీసెస్ క్లినిక్‌లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్ఐ-ఎల్డబ్ల్యూఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీరామ్ శ్రీనివాసరావు, జిల్లా రిసోర్స్ పర్సన్ బి. రామ్ ప్రసాద్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ శైలజ, న్యాయవాది జి. ఇందిరా ప్రసాద్, ఇతర అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


## విద్యార్థులతో మమేకమైన ఎంఈఓ



**నరసన్నపేట, ఫిబ్రవరి 19(వార్త):** నరసన్నపేట మండలం సత్యవరం గ్రామంలోని సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓ-2 దాలి నాయుడు గురువారం సందర్శించారు. మధ్యాహ్నం పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యార్థులతో నేరుగా మమేకమై పాఠాలను బోధించారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకు ప్రశ్నలు అడిగి వారి అవగాహన స్థాయిని పరిశీలించారు. పాఠాలను ఏ విధంగా నేర్చుకుంటున్నారో తెలుసుకుని సూచనలు అందించారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని దాలి నాయుడు పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు అందరూ సమిష్టిగా పనిచేయాలని సూచించారు.

## పోక్సో చట్టంపై అవగాహన

**నరసన్నపేట, ఫిబ్రవరి 19(వార్త):** నేటి సమాజంలో బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపుల పట్ల విద్యార్థినిలు అప్రమత్తంగా ఉండాలని ప్రైవేటు ట్రస్ట్ సభ్యులు సూచించారు. గురువారం నరసన్నపేట మండలం మాకివలసలోని మాకివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం (గూజూూ) గురించి వివరించి, గుడ్ టచ్ - బాడ్ టచ్ మధ్య తేడాలను గుర్తించుకోవాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు వెంటనే తెలియజేయాలని పేర్కొన్నారు. అలాగే బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, చదువుతోనే భవిష్యత్తు సురక్షితం అవుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మోహన్ దాస్, ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.



### పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్టు
# నిర్మాణానికి సహకరించం




* గంగువాడ సమావేశంలో రైతుల స్పష్టీకరణ

**మందస, ఫిబ్రవరి 19(వార్త):** పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి సహకరించమని పలువురు నాయకులు అన్నారు. మందస మండలంలోని గంగువాడ గ్రామంలో కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, ప్రధాన కార్యదర్శి జోగి అప్పారావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే శిరీష, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడులు పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్ట్ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఉద్దానంలో తప్పించి జిల్లాలో ఎక్కడ కట్టిన మేం స్వాగతిస్తామన్నారు. ఇప్పటి వరకు బాధిత రైతులు చేసిన పోరాటాన్ని ప్రభుత్వం గుర్తించకపోతే, తప్పకుండా ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. రైతులు అభిప్రాయం మేరకు ఈనెల 28న మరోసారి బహిరంగ సభ ఏర్పాటు చేసి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు గోవిందరావు, వెంకట్రావు, మద్దిల రామారావు, వంకల మాధవరావు, స్థానిక సర్పంచ్ పొట్టి ధర్మారావు, లండ రామస్వామి, మీడియా వింగ్ కన్వీనర్ బత్తిని లక్ష్మణ్, చిత్త గున్నయ్య, బడి సాంబమూర్తి, తెప్పల గున్నయ్య, తామడ హేమరాజు, గుంటు లోకనాథం, నల్ల పరుశురాం, పొట్టి ఎర్రయ్య, గుంటు రామస్వామి, సంతోష్, సంగారు జోగరావు, వల్లభరావు తదితరులు పాల్గొన్నారు.

## వీఏఏఎస్ అసోసియేషన్ అధ్యక్షునిగా దువ్వాడ శ్రీకాంత్



**మందస, ఫిబ్రవరి 19(వార్త):** శ్రీకాకుళం జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా మందస మండల పశువైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్ వరుసగా రెండవసారి ఎన్నికయ్యారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జరిగిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ ఎలక్షన్‌లో అధ్యక్షుడిగా మందస మండల పశువైద్యాధికారి దువ్వాడ శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ వై. సాయిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ టి.హరికృష్ణ, ట్రెజరర్ గా డాక్టర్ కిరణ్ కుమార్, జాయింట్ సెక్రటరీ గా డాక్టర్ ఎస్. ఓంకార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జేడీ డాక్టర్ కంచరాన రాజగోపాల్, డీడీ డాక్టర్ నరసింహులు, డాక్టర్ సూర్యనారాయణమూర్తి, డాక్టర్ గణపతి, డాక్టర్ సత్యప్రకాష్, ఎలక్షన్ ఆఫీసర్ డాక్టర్ రోణంకి ఆనందరావు, స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ వల్లే రమణ, అధికారుల సంఘం సభ్యులు డాక్టర్ పీఎస్జీ బాలకృష్ణ, డాక్టర్ యోగేశ్వరరావు, డాక్టర్ చంద్రశేఖర్ డాక్టర్ దిలీప్ తదితరులు అభినందించారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఘనంగా దుర్యోధన రెడ్డి జన్మదిన వేడుకలు

**ఇచ్ఛాపురం,ఫిబ్రవరి 19 (వార్త):** జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధన రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్, నియోజకవర్గ జనసేన నాయకులు దాసరి రాజు, మత్స్యకార విభాగ కార్యదర్శి నాగుల రవి బెహారా, మండల మహిళా అధ్యక్షురాలు దుర్గాసి నీలవేణి, మార్కెటింగ్ డైరెక్టర్ దుంగు భాస్కర్ రెడ్డి, దాసరి శేఖర్ తదితరులు బస్ స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలో పాల్గొని విజయవంతం చేశారు. జన్మదిన వేడుక సందర్భంగా ట్రాలీ రిక్షా కార్మికులకు వస్త్ర దానం చేశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. లొద్దపుట్టి జనసైనికులు, కొజ్జిరియా గ్రామ జనసేన జనసైనికులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.





## ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు

**సరుబుజ్జిలి జనవరి 19 (వార్త):** సరుబుజ్జిలి మండలంలోని అగ్రహారం గ్రామంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ ఫోటోకి తంగి చంద్ర భూషణ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తంగి రామకృష్ణారావు మాట్లాడుతూ హిందూ సామ్రాజ్య స్థాపన కోసం కృషిచేసిన, పోరాడిన యోధుడు శివాజీ ఆశయాల సాధనకు యువత కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొర్ను అప్పన్న అప్పారావు మాజీ చైర్మన్ కొర్ను రాజారావు భద్రయ్య అప్పన్న తంగి తవిటయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మున్సిపల్ పాఠశాలలో శివాజీ జయంతి వేడుకలు



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 19 (వార్త):** పంజా స్ట్రీట్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు, ఉపాధ్యాయులు ఆదినారాయణ, రాణి, దుర్గమ్మ, శైలజ, సౌజన్య, సుశీల, నాగమణి, కోఅప్టెడ్ సభ్యులు కాళ్ల శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.

## శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి




**పలాస, ఫిబ్రవరి 19 (వార్త):** పలాస పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. గోపీచంద్ రోలర్ స్కేటింగ్ అకాడమీ విద్యార్థులు పలాస పట్టణం నుండి ఐదు కిలోమీటర్ల మేర స్కేటింగ్ ర్యాలీ చేవారు. శివాజీ మహారాజ్ దేశభక్తిని, వీరత్వాన్ని చాటిచెప్పేలా విద్యార్థులు ఈ ప్రదర్శన చేపట్టారు. ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన సభలో శిక్షకురాలు (కోచ్) చంద్రావతి మాట్లాడుతూ.. హిందూ సమాజ రక్షణ కోసం శివాజీ మహారాజ్ చేసిన వీర త్యాగాలు మరువలేనివన్నారు. బాల్యం నుండే సాహస గుణాన్ని అలవరుచుకున్న శివాజీ, రాజ్యాధికారంలో మహిళలకు అత్యంత గౌరవాన్ని ఇచ్చేవారన్నారు. నేటి తరం విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణతో, సాహసంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కేటింగ్ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శివాజీ చిత్రపటానికి నివాళి



ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 17 ఏళ్ల చిరుప్రాయంలోనే యుద్ధం చేసి కోటలను గెలుస్తూ, మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి వారి దురాగతాలను చరమగీతం పాడి భారత దేశంలో మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించిన ఛత్రపతి శివాజీ ఆదర్శప్రాయుడన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు పాలవలస వైకుంఠరావు, పట్టణ అధ్యక్షులు పొట్నూరు తారకేశ్వరరావు, పూర్వ నియోజకవర్గ కన్వీనర్ రామానంద స్వామి జీ, జిల్లా కార్యవర్గ సభ్యులు వైశ్యరాజు మోహన్ రాజు, పొందర దుధిష్టి, నియోజకవర్గ సీనియర్ నాయకులు కంచరాన భుజంగరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్తు రామారావు, జామి మధు, వజ్రపుకొత్తూరు సీనియర్ నాయకులు బమ్మిడి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు.

## అసంపూర్తిగా మంగళవారం పేట రోడ్డు పనులు

**ఇచ్ఛాపురం,ఫిబ్రవరి19 (వార్త):** మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు మంగళవారం పేటలో అసంపూర్తిగా రోడ్డు పనులు చేపట్టారు. 5 లక్షల రూపాయల నాన్ ప్లాంట్ గ్రాంట్ నిధులు, 5 లక్షల రూపాయల జనరల్ ఫండ్ నిధులతో సిసి రోడ్డు పనులు చేపట్టారు. కొమ్మన వీధి జంక్షన్ నుండి ప్రతిభా హాస్పిటల్ వరకు రోడ్డు మార్గం వెడల్పుగా ఉండడంతో ఒక వైపు మాత్రమే రోడ్డు వేసి రెండో వైపు అర్థ భాగం విడిచి పెట్టారు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై కమిషనర్ రమేష్, ఏ ఈ రవి కిషోర్‌ను వివరణ అడుగగా పాత ఎస్టిమేట్ ప్రకారం ఒకేలా రోడ్డు ఉండాలని, అలా వేయడం జరిగిందని అన్నారు. వెడల్పుగా రోడ్డు వేస్తే కొంత భాగం వరకే రోడ్డు వస్తుందని తెలిపారు. పూర్తి స్థాయిలో నిధులు వచ్చేవరకు గ్రావెల్ లేదా మట్టితో బెర్మ్ లు వేయాలని కౌన్సిలర్ మధు మూర్తి కోరారు.



# పోలియో నిర్మూలనే రోటరీ ధ్యేయం

**✻ రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై కళ్యాణ్ చక్రవర్తి**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 19 (వార్త):** ప్రపంచవ్యాప్తంగా పోలియో సమూలంగా నిర్మూలించడమే రోటరీ అంతర్జాతీయ సంస్థ ధ్యేయమని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సంయుక్త ఆధ్వర్యంలో సభ్యులకు పోలియో నిర్మూలనకు నిధులు సేకరణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా పోలియోనిర్మూలకు రోటరీ కృషి చేస్తుందన్నారు. ఇంకా పాకిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్‌లలో పోలియో కేసులు నమోదు అవుతున్నాయన్నారు. స్థానికంగా ఉన్న దాతలు, పారిశ్రామికవేత్తలు పోలియో విరాళాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ ఫండ్ రైజింగ్‌కి మొదటి విడతగా ఇచ్ఛాపురం నుండి సోంపేట, ఆమదాలవలస, శ్రీకాకుళం, రాజాం, బొబ్బిలి మీదుగా విశాఖపట్నం వరకు 335 కిలోమీటర్లు పోలియో ఫండ్ రైసింగ్ కోసం రోటరీ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, కాకినాడ క్లబ్ నుండి పి మల్లికార్జునరావు, గోపాల రాజు సైకిల్ యాత్ర చేపట్టారు. వారు ఆముదాలవలస నుండి శ్రీకాకుళం చేరుకొని పోలియో వ్యాధిపై అవగాహన కల్పించారు. శ్రీకాకుళం నుండి బయలుదేరి రాజాం వైపు సైకిల్ యాత్ర కొనసాగించారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షులు బరాటం శ్రీనివాస్, రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు కె.దుర్గారావు మాట్లాడుతూ రోటరీ ప్రతినిధుల ద్వారా పట్టణంలో దాతలు నుండి పారిశ్రామిక, వ్యాపారవేత్తల నుండి విరాళాలు సేకరిస్తామన్నారు. మార్చి 10 లోపల తమ లక్ష్యాన్ని పూర్తి




చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ పోలియో చైర్ వై పార్థసారథి డి శివ శంకర్, ఎమ్మార్ కే దాస్, మంత్రి వెంకటస్వామి, అన్నెపు అనంతరావు, డా.బమ్మిడి సందీప్, కేటి నాయుడు, బరాటం భరత భూషణ్, అన్నెపు సత్యనారాయణ, పసగడ సూర్యనారాయణ, రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ.. సదుపాయాలపై ఏదీ?

**✻ సామాజిక వేత్త దువ్వాడ శ్రీధర్**



**పలాస, ఫిబ్రవరి 19 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అధికారులకు పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ, మౌలిక సదుపాయాలపై ఏదని సామాజికవేత్త దువ్వాడ శ్రీధర్ ప్రశ్నించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో 31 వార్డులు ఉండగా, సుమారు 1 లక్ష 30 వేల మంది ప్రజలు నివసిస్తున్నారని, 17,000 పైగా ఇళ్లకు హౌస్ టాక్స్ వసూలు చేస్తున్నారన్నారు. 2026 మార్చి 31 నాటికి హౌస్ టాక్స్ ద్వారా సుమారు 8 కోట్లు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఏడాది 15 శాతం పెంపు వల్ల ఈ ఆదాయం పెరుగుతుందన్నారు. ఇంత భారీ ఆదాయం వస్తున్న సందర్భంలో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించడం లేదన్నారు. ప్రతి వార్డులో నిత్యం పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు జరగడం లేదన్నారు. చాలా వార్డులకు రోడ్లు, కాలువలు లేవని, వీధి దీపాలు సైతం వెలగడం లేదన్నారు. కుళాయిల ద్వారా సక్రమంగా నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పారిశుధ్య పనులు చేసే కార్మికుల కొరత ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు ఆ పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తుండడం సరికాదన్నారు. మున్సిపల్ ఆదాయం, ఖర్చులపై పబ్లిక్ వైట్ పేపర్ విడుదల చేయాలని శ్రీధర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## రోడ్డు పనులు వేగవంతం చేయండి

**ఇచ్ఛాపురం,ఫిబ్రవరి19 (వార్త):** మున్సిపాలిటీ 15వ వార్డులో బంద రోడ్డులో రహదారి పనులు వేగవంతం చేయాలని పట్టణ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి నందిగామ కోటేశ్వరరావు, వార్డ్ మాజీ కౌన్సిలర్ నందిగామ సరస్వతిలు మున్సిపల్ ఏఇ రవి కిషోర్ ను కోరారు. ఈ మేరకు పనులు పరిశీలించారు.

## సౌండ్ బాక్స్‌లు అందజేత




**ఇచ్ఛాపురం,ఫిబ్రవరి19 (వార్త):** ముత్యాలమ్మ పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు డీఎస్సీ 2026 టీచర్‌లు జయలక్ష్మి, లిఖిత , హరిత లు రూ.8,000 విలువ చేసే స్పీకర్ బాక్సులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, డిజిటల్ బోధన మరింత మెరుగుపడాలనే ఉద్దేశంతో ఈ స్పీకర్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు.

## 14న జాతీయ లోక్ అదాలత్

**పలాస, ఫిబ్రవరి 19 (వార్త):** జాతీయ అదాలత్‌ను మార్చి14న నిర్వహించనున్నామని పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి తెలిపారు. పోలీసు అధికారులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ పాల్గొన్నారు.

## కొలిగాం స్కూల్‌లో తనిఖీ

**ఇచ్ఛాపురం,ఫిబ్రవరి 19 (వార్త):** కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షిక ప్యానెల్ ఇన్స్పెక్షన్ జరిగింది. ఈ కార్యక్రమం పలాస ఉపవిద్యశాఖాధికారి పి. విలియమ్స్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు కూరమన అప్పారావు, సున్నముద్ది విశ్వనాథం లతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఈదుపురం ప్రధానోపాధ్యాయులు బుడత తమ్మయ్య వివిధ పాఠశాలల నుండి వచ్చిన ఉపాధ్యాయులు ప్యానెల్ టీచర్‌లు హాజరయ్యారు. ఇన్స్పెక్షన్ లో రికార్డ్స్ అన్ని పరిశీలించి సంతృప్తి చెందారు.

## రేకులు, రాడ్లు పంపిణీ

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి19 (వార్త):** పోర్ట్ నిర్వాసిత గ్రామమైన మూలపేట గ్రామస్తులకు రేకులు, రాడ్లను టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి గురువారం పంపిణీ చేశారు. ఒక్కొక్క రేషన్ కార్డు దారునికి 33 రేకులు, 22 రాడ్లు లను అందజేశారు. మొత్తం 340 కుటుంబాలకు ఈ సామగ్రి అందజేస్తామని తెలిపారు. నిర్వాసితులకు కేటాయించిన ఆర్ అండ్ ఆర్ కాలనీలో తమకు కేటాయించిన స్థలములో తాత్కాలికంగా షెడ్లను వేసుకుని ఇళ్ల నిర్మాణం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ హేమ సుందర్ రావు, వీఆర్వో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి అనిల్ ప్రభాస్ తదితరులు ఉన్నారు.



## సిక్కోలు ఉద్దానం సేవా సమితి
# రూ.10వేలు ఆర్థిక సహాయం

**మందస, ఫిబ్రవరి 19(వార్త):** గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న టెంక విశ్వనాథం అనే వ్యక్తికి సిక్కోలు ఉద్దానం సేవా సమితి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేసింది. బెంకిలి గ్రామానికి చెందిన విశ్వనాథం గొంతు కేన్సర్ తో బాధ పడుతూ విశాఖపట్నం, తిరుపతి, హైదరాబాద్ నగరాల్లో ఉన్న పలు ఆసుపత్రిలలో వైద్యం పొందగా.. శస్త్ర చికిత్సకై లక్షలాది రూపాయలు వ్యయం అవుతుందని వైద్యులు తెలిపారు ఇప్పటికే అవకాశం ఉన్న ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా కార్డు లిమిట్ పూర్తి కావడంతో, భర్త చికిత్స కోసం టెంక పద్మావతి పిల్లలతో ఎదురుచూస్తున్నారన్న సమాచారం తెలుసుకుని సిక్కోలు ఉద్దానం సేవా సమితి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించింది. కార్యక్రమములో సేవా సమితి సభ్యులు రంజిత్, అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొత్తూరులో ఆక్రమణల తొలగింపు




**సోంపేట ఫిబ్రవరి 19(వార్త):** బారువ పంచాయతీ కొత్తూరు గ్రామంలో ఇండ్ల స్థలాల ఆక్రమణలను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. గతంలో గ్రామానికి ఆనుకొని పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇండ్ల స్థలాలను అదే గ్రామానికి చెందిన కొంతమంది దౌర్జన్యంగా ఆక్రమించుకోవడంతో ఆయా కుటుంబాలు ఇండ్ల నిర్మాణానికి నోచుకోక తీవ్ర ఇబ్బందులతో నెట్టుకు వస్తున్నారు. వీరి సమస్యపై మండల టిడిపి అధ్యక్షుడు మద్దు కుమార్ తహసిల్దార్ అప్పల స్వామికి ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు మండల సర్వేయర్ నాగేశ్వరరావు రెవెన్యూ ఇన్స్పెక్టర్ నిఖిల్ గురువారం కొత్తూరు గ్రామంలో బాధితుల సమక్షంలో ఆక్రమణలు తొలగించి పట్టాదారులకు అప్పగించారు. దీని పట్ల బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా అధికారులు వెనుదిరిగిన వెంటనే మళ్ళీ కొంతమంది ఆ స్థలాలపై వచ్చి బాధితులతో తగాదా పడుతూ స్థలాలు ఆక్రమించినట్లు తెలిసింది. దీనిపై పోలీసులను ఆశ్రయిస్తామని బాధితులు పేర్కొంటున్నారు.



## శ్రీముఖలింగేశ్వర ఆలయంలో
# శుద్ధి, సంప్రోక్షణ పూజలు

**జలుమూరు, ఫిబ్రవరి 19(వార్త):** మహాశివరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా జలుమూరు మండలంలోని శ్రీ ముఖలింగేశ్వర ఆలయంలో గురువారం సంప్రోక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకుడు తాటిగా రాజశేఖర్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య సంప్రోక్ష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## వైస్ ఎంపిపి కుటుంబానికి పరామర్శ



**ఇచ్ఛాపురం,ఫిబ్రవరి 19 (వార్త):** బూర్జ పాడు గ్రామంలో వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి పెద్దమామయ్య శివంగి జగ్గారావు ఇటీవలే మరణించారు. ఆ కుటుంబానికి పరామర్శించిన ఎంపీపీ బోర పుష్ప వైస్ఎంపిపి దున్న గురుమూర్తి కుటుంబానికి సంతాపం తెలిపారు. పార్టీ ప్రెసిడెంట్ పాతిర్ల రాజశేఖర్, కారింగి మోహన్ రావు, కేదారిపురం సర్పంచ్ నీలాపు సారథి, తులసిగాం సర్పంచ్ ప్రతినిధి ఇసురు తులసీరామ్ రెడ్డి పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన అవసరం



**పలాస, ఫిబ్రవరి 19 (వార్త):** స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా పలాస కాశీబుగ్గ పురపాలక సంఘంలో జరుగుతున్న ట్రైనింగ్ ప్రోగ్రాంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రజలందరికీ స్వచ్ఛ సర్వేక్షన్‌పై అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య పనులు మెరుగుపర్చాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌ని ఉపయోగించి చెత్తను రీసైక్లింగ్ చేసి జీరో బెస్ట్ చెత్త ఉండేటట్లు అందరూ కృషి చేయాలని కోరారు. మున్సిపాలిటీ చెత్త పర్యవేక్షణలో రాష్ట్రంలో జరుగు ర్యాంకింగ్లో మంచి మార్కులు సంపాదించి మున్సిపల్ అభివృద్ధికి ఎక్కువ నిధులు సాధించడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అధికారులు, మున్సిపల్ అధికారులు, ఆర్పీలు, ఏఎన్ఎం లు, శానిటరీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

## 22న మందస మండల సర్వసభ్య సమావేశం

**మందస, ఫిబ్రవరి 19(వార్త):** మందస మండల సాధారణ సర్వ సభ్యసమావేశం ఈ నెల 22న నిర్వహిస్తున్నట్టు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వై.వెంకటరమణ చెప్పారు. ఉదయం 10గంటలకు ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. సభ్యులు, ఆహ్వానితులు, అధికారులు తప్పక సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

## ఇంటింటా కొళాయి
# పనులు ప్రారంభం

**కంచిలి ఫిబ్రవరి 19(వార్త):** ఎమ్మెస్‌పల్లి పంచాయతీ రాగుపురం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటా కొళాయి పనులకు మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు గురువారం శంకుస్థాపన చేశారు. పంచాయతీ సీనియర్ టిడిపి నేత కిషోర్ పాడి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేతలు మాట్లాడుతూ అన్ని గ్రామాలకు ఈ పథకం ద్వారా పనులు త్వరలోనే ప్రారంభించి వేగంగా పూర్తి చేస్తామని అన్నారు. ఈ పథకం విషయంలో గ్రామాల్లో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ కృషి మేరకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల పురుషోత్తం, రెడ్డి శ్రీకాంత్, భాస్కర్ రెడ్డి, శ్రీరాములు, రెడ్డి వంశీ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546